ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం


స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని అత్తాపూర్ డివిజన్ తేజస్వీనగర్ కాలనీలో దేవాలయంలో సోమవరం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా భారీ మండపాన్ని ఏర్పాటు చేసి స్వామి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేధపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం కొనసాగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని సన్‌సిటీ ప్రధాన రహదారిలో బాలాజీ పాపలాల్ మిఠాయి షాప్ ముందు బౌండ్ ఫర్నిచర్ షోరూం వరకు రూ. 49.50 లక్షల వ్యయంతో నూతన అండర్ డ్రైనేజీ పనులను చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న లైన్‌ను తొలగించి కొత్త లైన్‌ను వేయనున్నామన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని సూచించారు.

స్వయంపాకం కిట్ల పంపిణీ


కిట్లను పంపిణీ చేసిన దృశ్యం

మణికొండ: వైశాక పౌర్ణమిని పురస్కరించుకుని మణికొండ అరుణాచల సేవా సత్సంగ్ నిర్వాహకులు పేద బ్రాహ్మణులు, దేవాలయ వర్కర్లు, వేద విద్యార్థులకు స్వయం పాకం కిట్లను సోమవారం పంపిణీ చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వంద మంది పేద బ్రాహ్మణులు, దేవాలయాల్లో పనిచేస్తున్న కార్మికులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... సేవా కార్యక్రమాలు ఎంతో మానసిక తృప్తిని ఇస్తాయని, రాబోయే తరాల వారికి ఎంతో మేలు చేస్తాయన్నారు. అరుణాచల సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అని కొనియాడరు. సత్సంగ్ ప్రతినిధులు, బ్రాహ్మణులు, కార్మికులు పాల్గొన్నారు.

అమర జవానులకు ఘనంగా నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

శంషాబాద్: పాకిస్తాన్ ఉగ్రమూకలతో యుద్ధం చేస్తూ ప్రాణాలు కోల్పోయిన జవానుల (టీడబ్ల్యూజేఎఫ్) తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించిన జర్నలిస్టులు అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద జవానుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉగ్రవాదాన్ని సమూలంగా తుదముట్టించాలని వక్తలు పేర్కొన్నారు. వీరజవాలనుకు ప్రజల అండ ఉంటుందన్నారు. యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మిద్దెల సత్యానారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు బి. దేవేందర్, నాయకులు గణేష్, గోపాల్, సుదర్శన్, భిక్షపతి, కె. యాదయ్య, శ్రీనివాస్, నర్సింహా, యాదగిరి, మాధవాచారి, ఎం.శ్రీనివాస్ ప్రభాకర్, ప్రవీణ్, జ్ఞానేశ్వర్, కిట్టు, ప్రసాద్, విజయ్, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులో సమస్యల మోత!

నీరు లేక ఎండిపోతున్న మొక్కలు

- లైట్లు లేక బోసిపోతున్న విద్యుత్ స్తంభాలు
- సాయంత్రమైతే అంధకారంలో పార్కు
- అసాంఘిక శక్తులకు అడ్డాగా పెద్దతాళ్లకుంట పార్కు


పార్కులో స్తంభానికి ఏర్పాటు చేయని విద్యుత్ లైట్లు


పార్కులో ఎండిపోతున్న మొక్కలు

అత్తాపూర్: వేసవిలో భానుడు రెచ్చిపోతున్నాడు. మేలో ఎండల తీవ్రత అధికంగా నమోదు కావుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఈ నేపథ్యంలో బోరు బావులు ఎండిపోయి పెద్దతాళ్లకుంట పార్కులో ఉన్న పచ్చటి గడ్డి, చెట్లు, పూల మొక్కులు తదితర ప్లాంట్‌లు ఎండిపోతున్నాయి. పార్కులో ఉన్న మైదాన ప్రాంతం పచ్చదనానికి దూరమై సందర్శకులకు నిరాశను మిగులుస్తోంది. దీనికి తోడు పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో రాత్రి వేళల్లో తాగుబోతులకు అడ్డాగా గోడలు గేట్లు దుకేసి పార్కులో ప్రవేశించి తప్పతాగుతూ తాగిన సీసాలను అక్కడే పగలగొట్టి స్థానిక పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. ఈ మేరకు యోగా సెంటర్ నిర్వాహకులు స్థానిక యువకులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదు.

- పార్కు పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉంటేనే ప్రజలు సేద తీర్చుకోవడానికి వస్తారు. పచ్చదనం కొరవడటంతో సందర్శకులు క్రమేపీ తగ్గిపోతున్నారు.
- పెద్దతాళ్లకుంటను పార్కుగా అభివృద్ధి చేసి నాటి నుంచి ఇప్పటి వరకు ఈ పరిస్థితిలో పార్కుని చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి అధికారులు సమన్వయంతో వ్యవహరించి పార్కులో పచ్చదనాన్ని పెంచి.. వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సత్వరమే పరిష్కరిస్తాం



పెద్దతాళ్లకుంట పార్కులో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం. స్థానికంగా ఉన్న ఓపెన్ జిమ్ వ్యవస్థను ఆధునీకరిస్తాం. విద్యుత్, జలమండలి అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను అధిగమిస్తాం. భూగర్భ జలాలు అడుగంటుతున్నందున బోరు బావి ఎండిపోయింది. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారిస్తాం.

- నరేందర్‌గౌడ్, ఈఈ, రాజేంద్రనగర్ మున్సిపల్

సీసీ కెమెరాలు అవసరం



పెద్దతాళ్లకుంట పార్కులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ పని చేయడం లేదు. రాత్రి సమయంలో తాగుబోతులకు కేంద్రంగా మారింది. నీటి సరఫరా లేక కళ్ల ముందే చెట్లు, మొక్కలు ఎండిపోతున్నాయి. తనలో తాను ఏమి చేయలేక పోతున్నాముమానసికంగా బాధపడుతున్నాం.

- గడ్డం సుజాత, పార్కు నిర్వాహకురాలు

చిత్రపురి కొత్త ప్రాజెక్ట్ బ్రోచర్ విడుదల


మాట్లాడుతున్న అధ్యక్షుడు అనిల్‌కుమార్

మణికొండ: తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన చిత్రపురి కాలనీలో చేపడుతున్న నూతన ప్రాజెక్ట్ షఫైర్‌సూట్ బ్రోచర్‌ను ఆదివారం రాత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ మాట్లాడుతూ... కొత్త ప్రాజెక్ట్‌ను 40 నెలల్లోనే పూర్తి చేస్తామన్నారు. చిత్రపరిశ్రమలో ఇప్పటి వరకు ఇళ్లు రాని వారు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. సొసైటీకి రూ. 166 కోట్ల అప్పు ఉందని, కొత్త ప్రాజెక్ట్ పూర్తి చేసి ఆ అప్పును తీరుస్తామన్నారు. చిత్రపురిలో ఇంకా రూ. 50 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు. వాటిని కూడా సత్వరమే పూర్తి చేస్తామని వల్లభనేని స్పష్టం చేశారు. ఇదొక ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాదాల రవి, కె.ఎల్. దామోదర్ ప్రసాద్, డైరెక్టర్ విభాగం అధ్యక్షుడు వీర శంకర్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, అమ్మిరాజు, అనుపంరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సినీ ప్రముఖులు చదలవాడ శ్రీనివాసరావు, తమ్మారెడ్డి భరద్వాజ్, లలిత, మహానందరెడ్డి, రఘు, దీప్తి వాజపేయి, అనితలతో పాటు 24 ఫ్రేమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’లో నాలుగు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ అంశాలపై నాలుగు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించిన ప్రజావాణిలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రజలు పాల్గొని ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందించారన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన నాలుగు ఫిర్యాదులు అందించినట్లు తెలిపారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం



అలకాపూర్ టౌన్‌షిప్‌లో పేరుకుపోయిన చెత్త

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన పెరుకుపోతున్న చెత్తను ఎప్పటికపుడు తొలగించాల్సిన మున్సిపల్ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవటంతో ఎక్కడికక్కడ పేరుకుపోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్లతో పాటు కాలనీల్లోని రోడ్లను ఎప్పకప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు వందలాది మంది సిబ్బంది, కార్మికులు పనిచేస్తున్నారు. వారితో ప్రణాళికాబద్ధంగా పనిచేయించాల్సిన అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కార్మికులు చేసిందే పనిగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, మున్సిపాలిటీ ఇంచార్జి అధికారి ప్రత్యేక దృష్టి సారించి పారిశుద్ధ్య పనులపై చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

మైలార్‌దేవ్‌పల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి మెయిన్ గ్రామంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... డివిజన్ మెయిన్ విలేజ్‌లోని ఉమ్మడి హనుమాన్ దేవాలయం వీధిలో ఎక్కడ చూసినా డ్రైనేజీ నీరు ఏరులై పారుతున్నాయన్నారు. జలమండలి అధికారులు చూసీచూడనట్లు గాలికి వదిలేస్తున్నారన్నారు. నల్లాల్లో తాగు నీరు రాక అలమటిస్తున్న ప్రజలకు కనీసం ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాలన్న ఆలోచననే అధికారులకు లేదన్నారు. ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు ఎక్కువగా నిసించే మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.రాముయాదవ్, యూత్ అధ్యక్షుడు అక్కం రఘు, మైసిరెడ్డి, రాజేష్‌యాదవ్, అరుణ్‌ముదిరాజ్, చిరంజీవి, కొంపల్లి జగదీష్, రాజు, ఆప్కో రాజు, భగవాన్‌దాస్, రాజు, ప్రవీణ్, వెంకటరమణ, అశోక్‌కుమార్, సందీప్, భాస్కర్, సునీల్, సరికొండ దుర్గేష్, భూదేవి, సరిత, అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు



మైలార్‌దేవ్‌పల్లి: వేగంగా వచ్చిన ఓ కారు (టీజీ07 జే73335) అదుపు తప్పి పల్లెచెరువు సమీపంలోని ఓ డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. ఆరాంఘర్ నుంచి చంద్రాయణగుట్ట వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే కారు బెలూన్లు ఓపెన్ కావడంతో కారులోని ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు నుజ్జునుజ్జు అయింది. స్థానికులు వెంటనే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అదుపుతప్పిన ఆటో ట్రాలీ

- ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె, స్తంభాలను ఢీకొట్టిన ఆటో
- ఏడు గంటలపాటు ఆగిన విద్యుత్ సరఫరా

రాజేంద్రనగర్: అదుపుతప్పిన ఓ ఆటో ట్రాలీ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెతో పాటు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రధాన రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వివరాలివీ... బుద్వేల్ ప్రధాన రహదారిపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి స్థానికంగా ఉన్న రెండు బస్తీలకు విద్యుత్ సరఫరా అవుతోంది. సోమవారం మధ్యాహ్నం చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన వాటర్ క్యాన్లను సరఫరా చేసే ఆటో ట్రాలీ వేగంగా దూసుకొచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో విద్యుత్ స్తంభం విరిగి కిందపడగా... ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ధ్వంసమైంది. అదృష్టవశాత్తు ఈ సంఘటన కారణంగా ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఆటో ట్రాలీ డ్రైవర్‌ను నిలదీశారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కారణంగానే తన ఆటోకు ప్రమాదం జరిగిందని... తనకే నష్టం పరిహారం చెల్లించాలని వాగ్వాదానికి దిగాడు. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభం ఏర్పాటుకు డబ్బులు చెల్లించాలని సిబ్బంది కోరడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీని కారణంగా దాదాపు 6 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చివరకు విద్యుత్ శాఖనే మరమ్మతులు చేసింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ తెలిపారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి


సరోజిని దేవి కంటి ఆసుపత్రి

గోల్కొండ: మెహిదీపట్నంలోని సరోజిని దేవి కంటి ఆసుపత్రికి నగరం నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ప్రతినిత్యం వేలాది రోగులు వస్తుంటారు. రోగులు, వారి సహాయకులు రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెహిదీపట్నం నుంచి శంషాబాద్‌కు వెళ్లే పీవీ ఎక్స్‌ప్రెస్‌వే ఆసుపత్రి ముందు నుంచే ప్రారంభమవుతోంది. ఈ బ్రిడ్జి నుంచి శంషాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు సరోజిని దేవి ఆసుపత్రి ముందు నుంచే వెళ్తాయి. కాగా ఈ రోడ్డుకు డివైడర్ల మధ్య కొంత ఖాళీ ప్రదేశం వదిలారు. ఆసుపత్రికి వచ్చే వారు ఆసుపత్రి నుంచి వెళ్లే వారు డివైడర్‌లో ఉన్న ఖాళీ ప్రదేశం నుంచే రోడ్డు దాటాలి. అయితే రోడ్డు ఇరువైపులా నుంచి రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీంతో ఆసుపత్రికి వచ్చి రోడ్డు దాటేవారు బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటుతున్నారు. ఆసుపత్రి గేటు ముందు గానీ దానికి కొద్ది దూరంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ఆసుపత్రికి వచ్చే రోగులకే కాకుండా రోడ్డు దాటాలనుకునే పాదచారులకు సైతం సౌకర్యవంతంగా ఉంటుంది.

‘భారత్‌కు ఎదురు లేదు’

గోల్కొండ: భారత్‌కు తిరుగులేదు అన్న విషయం మరోమారు రుజువైందని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సోమవారం రిసాల బజార్‌లో ఆయన ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రక్షణ రంగంలో అగ్రదేశాలకు దీటుగా భారత దేశం ఎదిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బి.సాయిబాబాచారి, శివ, బి.సురేష్‌చారి, రాములు తదితరులున్నారు.

వేసవి దుక్కులతో చీడపీడల నివారణ

- నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పవన్‌చంద్రారెడ్డి
- పెద్దగోల్కొండలో ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

శంషాబాద్ రూరల్: వేసవి దుక్కులతో పంటలకు ఆశించే చీడపీడల నివారించవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నేల ఆరోగ్య యాజమాన్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.పవన్‌చంద్రారెడ్డి సూచించారు. పెద్దగోల్కొండలో సోమవారం ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు వాతావరణ ఆధారిత సలహాలు, సూచనలు పాటించి సాగు చేసుకుంటే నష్టాలు రాకుండా చూసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు తగు మోతాదులోనే ఎరువులు వాడాలని సూచించారు. పంట మార్పిడి, సేంద్రియ ఎరువులతో పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.వినయ్ మాట్లాడుతూ... రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అవలంభిస్తూ ఎరువుల వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పశువుల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రతలను మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.శేఖర్ వివరించారు. ఇందుకు సంబంధించి రూపొందించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.శ్రీకాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, రైతులు భాస్కర్‌గౌడ్, భోజిరెడ్డి, పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, ఏఈఓ రాఘవేందర్‌గౌడ్, వ్యవసాయ కళాశాల పరిశోధన విద్యార్థిని వి.వర్షిత తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో అధ్వానంగా పారిశుద్ధ్య వ్యవస్థ

శాస్త్రిపురం: సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలోని బస్తీల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా తయారవుతోంది. అపరిశుభ్రత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చింతల్‌మెట్, సెట్విన్‌కాలనీ, మీరాలం చెరువు, హసన్‌నగర్, వాదియామహ్మద్, ఎంఎం పహాడీ, ఎన్‌టీఆర్ నగర్ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్త కుండీలు లేక ప్రజలు రహదారులపైనే చెత్తను వేస్తున్నారు. రోడ్ల పక్క డ్రైనేజీలు పొంగిపొర్లుతుండటంతో పరిసర ప్రాంతాలన్నీ మురుగుమయంగా మారుతున్నాయి. పలు ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించి పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ప్రజలు కూడా రహదారులపై చెత్తను వేస్తుండటం, ఆ చెత్తకు డ్రైనేజీల నుంచి పొంగుతున్న మురుగునీరు తోడవుతుండటంతో ఆయా బస్తీల ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోంది. వాటి నుంచి వెలువడుతున్న దుర్వాసనకు తోడు పందుల సంచారం వెరసి స్థానికులకు రోగాల బారిన పడుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి బస్తీల్లో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పరిశ్రమల సహకారంతో నైపుణ్యాల వృద్ధికి కృషి


కార్యక్రమంలో పాల్గొన్న నాస్‌కామ్ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నాస్‌కామ్ ఆధ్వర్యంలో అనుభవాత్మక ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. పాఠ్యాంశంలో కలిపే అంశాలతో పాటు సహకార నమూనాలు, పట్టభద్రుల నైపుణ్య లక్ష్యాలకు అనుసంధానం, అమలుకు తగిన వ్యూహాల వాటిపై చర్చించారు. నాస్‌కామ్‌తో కళాశాల చేసుకున్న ఎంఓయూలో భాగంగా విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, ఉపాధికి అనుగుణమైన నైపుణ్యాలు అందించడానికి దోహదపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఆర్.రవీంద్ర అన్నారు. పరిశ్రమల సహకారంతో నైపుణ్యాల అభివృద్ధికి ఇది ఒక మార్గదర్శక మోడల్‌గా నిలిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్‌ఈపీ 2020 అనుగుణంగా క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌లను పాఠ్యాంశంలో సమగ్రంగా ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాస్‌కామ్ ప్రతినిధులు షీబా థామస్, కమ్రాన్ అష్రఫ్, సీనియర్ కన్సల్టెంట్, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ వై.రామ్మోహన్‌రావు, కళాశాల కంప్యూటర్ సైన్స్ డీన్ డాక్టర్ జి.వేంకటరామిరెడ్డి, పరిశోధన డీన్ డాక్టర్ జె.కృష్ణచైతన్య, విద్యా వ్యవహారాల డీన్ డాక్టర్ ఎస్.రాజేందర్, మూక్స్ అండ్ ఐఐఐసీ ఇంచార్జి డాక్టర్ ఎస్.వి.వసంత, ఎంటీసీఎస్ హెడ్ డాక్టర్ డి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నల్లా అక్రమ కనెక్షన్లపై విచారణ చేయాలి: బీఆర్‌ఎస్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నల్లా కనెక్షన్‌లపై సంస్థ సమగ్ర విచారణ జరిపించి అక్రమ కనెక్షన్లు ఇచ్చిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో సోమవారం గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 2, 3లలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు జలమండలి అధికారులు కొందరికి పెద్ద సైజులో నీటి కనెక్షన్‌లను ఇచ్చి తక్కువ బిల్లులు వేస్తున్నారని, మరికొందరికి నీరు రాకపోయినా బిల్లులు దండుకుంటున్నారని ఫిర్యాదులు చేశారు. కొన్ని గేటెడ్ కమ్యూనిటీలకు గంటల తరబడి నీటిని సరఫరా చేసే ప్రతి నెల వేలాది రూపాయలను వారి నుంచి తీసుకుంటున్నారన్నారు. వేసవిలో కొత్త కనెక్షన్‌లు ఇవ్వవద్దని ఆదేశాలు ఉన్నా వాటిని బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా జారీ చేస్తున్నారన్నారు. స్పోర్ట్స్ పార్క్‌లో నిర్మించిన రిజర్వాయర్‌ను వినియోగంలోకి తెస్తే వేసవిలో ప్రజలకు మరింత నీటిని సరఫరా చేసే అవకాశం ఉన్నా ఆ విషయాన్ని పట్టించుకోవటం లేదన్నారు. టౌన్‌షిప్‌లో చెత్తను వారానికి ఒక సారి ఊడుస్తున్నారని, దాన్ని రోజు, విడిచి రోజుకు మార్చాలని ప్రజలు కోరారన్నారు. పెరుగుతున్న అపార్ట్‌మెంట్‌లకు అనుగుణంగా డ్రైనేజీ లైన్లను ఆదునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, బి.ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కిరణ్, భానుచందర్, సుమ నళిని, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పదవులకు న్యాయం చేయాలి

బీజేపీ జిల్లా సంరక్షణ ప్రబారి ప్రకాశ్


సమావేశమైన బీజేపీ ముఖ్య నాయకులు

మణికొండ: బీజేపీలో పదవులు తీసుకున్న వారు వాటిని న్యాయం చేయాలని, అలాంటి వారికే పదవులను కట్టబెడతామని పార్టీ జిల్లా సంరక్షణ ప్రబారి కంజర్ల ప్రకాశ్ అన్నారు. సోమవారం మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపాలిటీ కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... త్వరలోనే మున్సిపాలిటీ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి స్థాయి కమిటీలను ప్రకటిస్తామన్నారు. అందులో పదవులు పొందిన వారు పూర్తి స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే పరమావధిగా పార్టీ పనిచేస్తుందని, పార్టీకి అధిక సమయం ఇచ్చే వారే పదవులను పొందాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, నాయకులు సి.బీరప్ప, జె.సిద్దప్ప, వందన నాగేష్, జె.లక్ష్మీ, అనితాదేవి, బి.శివకుమార్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, శంకర్, ఆనందరావు, శంకర్‌సింగ్, భీంరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

గోల్కొండ: నాలుగు లేబర్ కోర్డ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకుడు జి.విఠల్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక సమ్మె పోస్టర్‌ను సోమవారం ఆయన టోలిచౌకీ లేబర్ అడ్డా వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారులకు మేలు జరిగేలా కార్మిక వ్యతిరేక చట్టాలు రూపొందిస్తుందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రతినెలా రూ.4500 నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాకూబ్, జిలానీ, బక్షిస్ తదితరులు పాల్గొన్నారు.